క్లుప్తంగా

నిలిచిన విద్యుత్ సరఫరా.. రోగుల అవస్థలు

అగనంపూడి: భారీ వర్షానికి శుక్రవారం అర్ధ రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అగనంపూడి ఏరియా ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులు అవస్థలు పడ్డారు. అర్ధరాత్రి 12 నుంచి శనివారం రాత్రి 9 గంటల వరకు నిరాటంకంగా విద్యుత్ సప్లై నిలిచిపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పలేదు. ఆస్పత్రిలో ఉన్న జనరేటర్ మొరాయించడంతో ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరయ్యారు. సాయంత్రానికి శనివాడ, గళ్లవానిపాలెం ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లకు విద్యుత్ సరఫరా చేసినా, నిర్వాసిత కాలనీల్లో రాత్రి 9 దాటినా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేపట్టలేదు. ఆస్పత్రికి కూడా ఇదే పరిస్థితి ఉండడంతో ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ భారతి జనరేటర్ మరమ్మతులు చేయించి, శనివారం రాత్రికి ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు.

కొనసాగుతున్న దీక్షలు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1206వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ ఉక్కు కార్మికులు ఉక్కు సంకల్పంతో కర్మాగారాన్ని రక్షించుకోడానికి చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కును కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మస్తానప్పకు సత్కారం



మస్తానప్పను సత్కరిస్తున్న వెంకట్రామయ్య

గాజువాక: వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్పను గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ఘనంగా సత్కరించారు. మస్తానప్ప జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, నక్క వెంకట రమణ, ఎన్నేటి రమణ, కర్రి దాలినాయుడు, పిట్టా రెడ్డి, బోరా శశిభూషణరావు, టేకేటి వెంకట రమణ, దాసరి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న కరణంరెడ్డి

పెదగంట్యాడ: రక్తదానంపై అపోహలు వీడి, ప్రతి ఒక్కరూ రక్తం దానం చేయాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కిల్లాన ముసలయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నవీన్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో వందేభారత్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో పెదగంట్యాడలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే ఈఎన్‌టీ, డెంటల్, జనరల్ చెకప్, కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాటా శ్రీను, గూటూరు శంకరరావు, ములకలపల్లి ఈశ్వరరావు, సోంబాబు, కరణం వరలక్ష్మి, శ్రీను, సియ్యాద్రి అప్పలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పెదగంట్యాడ: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో కె.రాంబాబు, బి.హరి విద్యార్థులతో శనివారం కబడ్డీ ఆడించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో 16 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అర్ధరాత్రి వర్ష బీభత్సం

- ఈదురు గాలులకు కూలిన చెట్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- బెంబేలెత్తిన అగనంపూడి, దువ్వాడ వానులు
- పలుచోట్ల తెగిన కరెంట్ వైర్లు
- చురుగ్గా విద్యుత్ పునరుద్ధరణ చర్యలు



జాతీయ రహదారి పెట్రోల్ బంక్‌పక్కన రోడ్డుమీదికి పడిన కొమ్మలను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది



అన్నపూర్ణనగర్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

అగనంపూడి: ఉరుములు, మెరుపులు, వర్ష బీభత్సానికి అగనంపూడి అతలాకుతలం అయింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత సుమారు రెండు గంటల పాటు భారీగా ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో అగనంపూడి ఆర్ఈసీఎస్ సెక్షన్ కార్యాలయం పరిధిలోని పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగగా, అనేక చోట్ల విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. కొండయ్యవలస, ప్రధాన రహదారి, హైవే, సెక్టార్-1, పెదమడక, నిర్వాసిత కాలనీల్లో భారీ వృక్షాలు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో రాత్రి నుంచే విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రెండుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లపై చెట్ల కొమ్మలు విరిగి పడడంతో, వాటిని తొలగించి మరమ్మతులు చేపట్టారు. శనివారం రాత్రి వరకు విద్యుత్ పునరుద్ధరణ కోసం ఏపీఈపీడీసీఎల్, ఆర్ఈసీఎస్ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది శ్రమించారు. ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎల్.మహేంద్ర, ఆర్ఈసీఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తమరాన రామకృష్ణ, బి.కె.నాయుడు, ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ పి.పార్థసారథి, ఆర్ఈసీఎస్ డీఈఈ దాసరి వరప్రసాద్ తదితరులు 40 మంది సిబ్బందితో శనివారం ఉదయమే అగనంపూడి చేరుకున్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. విరిగిన చెట్ల కొమ్మలను, నేలకొరిగిన చెట్లను తొలగించారు. విద్యుత్ స్తంభాలను కొత్తవి ఏర్పాటు చేశారు. వైర్లను ఎక్కడికక్కడే అమర్చారు. శనివారం రాత్రి 9 గంటలకు విద్యుత్ పునరుద్ధరణ జరిగింది. సిబ్బందికి అగనంపూడి అభివృద్ధి కమిటీ, జిల్లా రజక సంఘం ప్రతినిధులు అధికారులు, సిబ్బందికి సహాయ సహకారాలు అందించారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల కష్టాలు

వర్ష బీభత్సానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో దువ్వాడ రైల్వే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వందలాది మంది ప్రయాణికులు రిజర్వేషన్ల కోసం వచ్చి వెనుదిరిగారు. విద్యుత్ సరఫరా లేకపోవడం, జనరేటర్, యూపీఎస్‌లు లేకపోవడంతో రిజర్వేషన్ ప్రక్రియ పడకేసింది. దీంతో సాధారణ ప్రయాణికులకు మాన్యువల్ టికెట్లు మంజూరు చేశారు. కోచ్ ఇండికేటర్లు కూడా పనిచేయలేదు. ప్లాట్‌ఫామ్‌లపై ఫ్యాన్లు తిరగక ఉక్కపోతతో ప్రయాణికులు ఉక్కిరి బిక్కిరయ్యారు.



అగనంపూడి ప్రధాన కూడలిలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన చెట్ల కొమ్మలు



తెగిన విద్యుత్‌వైర్లను పరిశీలిస్తున్న ఎస్ఈ మహేంద్ర

ఈదురుగాలులకు విరిగిపడిన చక్రం

అక్కిరెడ్డిపాలెం: ఈదురుగాలులు, పిడుగులతో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రసన్న గిరిపై ఆలయాలకు వెళ్లే మెట్ల మార్గంలో ఆర్చిపై ఉన్న సిమెంట్ చక్రం విరిగిపడింది. గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో శనివారం పునరుద్ధరించారు.



ప్రసన్న గిరి ఆలయం వద్ద ఆర్చిపై ఉన్న చక్రం ఈదురుగాలులకు విరిగి పడిన దృశ్యం



బీసీ కాలనీలో రోడ్డుపై అడ్డంగా విరిగి పడిన చెట్లు కొమ్మలు

చురుగ్గా పింఛన్ల పంపిణీ

- 70 శాతం మందికి బ్యాంకుల ద్వారా చెల్లింపు
- మిగిలిన వారికి ఇంటికి వెళ్లి అందజేత



71వ వార్డులో అవ్వకు పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి



పింఛన్ పంపిణీ కోసం 75వ వార్డులో అవ్వకు ఐరిస్ తీస్తున్న సచివాలయ ఉద్యోగి



85వ వార్డులో వృద్ధుడికి ఐరిస్ తీస్తున్న సచివాలయ ఉద్యోగి

గాజువాక: పింఛన్ల పంపిణీ తొలిరోజే దాదాపు పూర్తయింది. లబ్ధిదారులలో 70 శాతం మందికి బ్యాంకుల ద్వారా పింఛన్లను అందించగా, మిగిలిన వారికి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వలంటీర్లు తమ విధులకు దూరంగా ఉంటున్న వేళ సచివాలయ సిబ్బంది సహకారంతో అధికారులు పింఛన్లను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల కూడా గాజువాకలోని అవ్వాతాతలకు, ఇతర లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఒకటో తేదీనాడే పింఛన్ల పంపిణీ దాదాపు పూర్తి చేయడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గాజువాక జోన్‌లో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు సహా మొత్తం పింఛన్‌దారులు 32,636 మంది. వారిలో 23,130 మంది (70.88 శాతం) లబ్ధిదారులు బ్యాంక్ ఖాతాలు కలిగి ఉండటంతో ప్రభుత్వం వారికి నేరుగా అకౌంట్లలో జమ చేసే విధంగా చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. మరో 9,506 మంది (29.12శాతం) లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలు లేవు. దీంతో వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసే బాధ్యతలను ప్రభుత్వం సచివాలయ సిబ్బందికి అప్పగించింది. జోన్‌లో 106 సచివాలయాల్లోని సిబ్బంది శనివారం ఇంటింటికీ వెళ్లి 8206 మంది (87 శాతం) మందికి పింఛన్ అందజేశారు. మిగిలిన 1300 మందికి కూడా రానున్న రెండు రోజుల్లోగా పింఛన్లు అందిస్తామని గాజువాక జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు తెలిపారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉక్కునగరం యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. యూత్ హాస్టల్స్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, సెంట్రల్ స్టోర్స్ జనరల్ ఫోర్‌మన్ ఎం.కృష్ణమూర్తి పదవీ విరమణ చేసిన సందర్భంగా సెక్టార్-2, సత్య సాయి ఆలయ ప్రాంగణంలో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి అతిథులుగా స్టీల్‌ప్లాంట్ స్టోర్స్ జీఎం ఇన్‌చార్జ్ జి.అప్పారావు, జీఎం నారాయణరావు హాజరయ్యారు. కృష్ణమూర్తి, పద్మావతి దంపతులు ముందుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పదవీ విరమణ చేసేటప్పుడు తమవంతుగా అందుబాటులో ఉన్న ప్రదేశంలో మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడిన వారవుతారన్నారు. కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ ప్రతినిధులు వి.ఆర్.కె.రాజు, సాయిరామరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉక్కునగరంలో మొక్కలు నాటుతున్న యూత్ హాస్టల్స్ ప్రతినిధులు

14 టేబుళ్లు.. 22 రౌండ్లు

గాజువాక ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

గాజువాక: గాజువాక నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశారు. ఇప్పటికే అభ్యర్థుల నుంచి కౌంటింగ్ ఏజెంట్ల వివరాలను తీసుకున్న అధికారులు వారికి కౌంటింగ్ పాసులను కూడా జారీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి సాక్షికి వివరించారు.

గాజువాక నియోజకవర్గంలో 3,33,611 మంది ఓటర్లకు గాను 2,32,949 మంది ఓట్లు వేసిన విషయం తెలిసిందే. ఈ ఓట్ల లెక్కింపునకు నగరంలోని ఏయూ కెమికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో అసెంబ్లీ ఓట్లు, మొదటి అంతస్తులో పార్లమెంట్ అభ్యర్థుల ఓట్లు లెక్కిస్తారు. అసెంబ్లీ ఈవీఎంల కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు రిటర్నింగ్ అధికారి (ఆర్వో)కి ఒక టేబుల్ ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఆరు టేబుళ్లను ఏర్పాటు చేశారు. వీటన్నింటి లెక్కింపు ఒకే హాల్‌లో నిర్వహిస్తారు. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను 22 రౌండ్లలో లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కానుంది. ఈవీఎం టేబుళ్లతో సంబంధం లేకుండా ఈ కౌంటింగ్ కొనసాగుతుంది. ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కానుంది. ఇవిగాక నియోజకవర్గం నుంచి 788 సర్వీసు ఓట్లను విడుదల చేయగా, వాటిలో ఇప్పటివరకు 287 సర్వీసు ఓట్లు అధికారులకు చేరాయి. వీటిని స్వీకరించడానికి మరోరోజు గడువు ఉన్నట్టు ఆర్వో లక్ష్మారెడ్డి తెలిపారు. వాటిని కౌంటింగ్ రోజు స్కాన్ చేసి వ్యాలిడిటీని నిర్ధయిస్తారు.



లక్ష్మారెడ్డి, రిటర్నింగ్ అధికారి

ఇదిలా ఉండగా, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గాజువాక సెగ్మెంట్ ఓట్ల లెక్కింపునకు 16 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఈ కౌంటింగ్ ఉదయం ఎనిమిది గంటలకే ప్రారంభం కానుంది. మొత్తం 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది. పార్లమెంట్‌కు సంబంధించిన గాజువాక పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ జిల్లా కలెక్టర్ సారథ్యంలో చేపడతారు.

కౌంటింగ్ ఏజెంట్లకు పాస్‌ల జారీ

ఓట్ల కౌంటింగ్‌కు అభ్యర్థుల తరపున పాల్గొనున్న ఏజెంట్లకు రిటర్నింగ్ అధికారి పాస్‌లను జారీ చేశారు. వాటిని అభ్యర్థులకు శనివారం అందజేశారు. ఏజెంట్లు కౌంటింగ్ రోజు ఉదయం ఆరు గంటలకల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి. ప్రతి ఏజెంటు తమ పాస్‌ను ధరించడంతో పాటు ఏదో ఒక గుర్తింపు కార్డును తనతో తీసుకొని వెళ్లాల్సి ఉంటుంది. ఏజెంట్లు తమతో పాటు 18సీ ఫారం, ఒక పెన్ను, పెన్సిల్, తెల్ల కాగితాలను తప్ప ఎటువంటి ఎల్రక్టానిక్ పరికరాలను గాని, మొబైల్ ఫోన్లను గాని తీసుకురాకూడదని ఆర్వో పేర్కొన్నారు.

230 మందికి ఉచిత వైద్యసేవలు

గాజువాక: గాజువాక లయన్స్ క్లబ్, అమరావతి నగర్ సంక్షేమ సంఘం, గాజువాక శిష్టకరణ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిష్టకరణ సంఘం అధ్యక్షుడు బలివాడ సత్యారావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు 230 మందికి ఉచిత వైద్య సేవలను అందించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అశ్విన్, డాక్టర్ కుప్పిలి సురేష్, డాక్టర్ జి.రాంబాబు ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అందరికీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, నిర్వాహకులు కరకవలస గౌరీ ప్రసాదరావు, బాసంగి తిరుపతిరావు, బలివాడ హరిబాబు, ప్రతాపరావు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలను అందిస్తున్న డాక్టర్లు

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి: అగనంపూడి నిర్వాసిత కాలనీ పెదమడకలోని సంపత్ వినాయక ఆలయ 25వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీఅయ్యప్ప సుబ్రహ్మణ్య స్వామి సహిత సంపత్ వినాయక ఆలయంలో ముందుగా స్వామి వారి మూలవిరాట్‌కు విశేష పంచామృతాభిషేకాలు జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మోటూరి వెంకటరమణ దంపతులు, కోశాధికారి విందుల నారాయణరావు దంపతులు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు, భక్తులు

మజ్జిగ పంపిణీ

అక్కిరెడ్డిపాలెం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని గాజువాక బీసీ రోడ్డులోని షాప్స్ నిర్వాహకులు పాదచారులకు, వాహనచోదకులకు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఆటోస్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ 500 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో షాప్ నిర్వాహకులు రాజు, జయ, శివ, సందీప్, స్వామీజీ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



షీలానగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో ..



ఉక్కు హనుమాన్ ఆలయంలో ..



నడుపూరు అభయాంజనేయస్వామి ఆలయంలో..

అక్కిరెడ్డిపాలెం: హనుమజ్జయంతిని జీవీఎంసీ 68, 69వ వార్డుల్లోని పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. షీలానగర్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్త గుళ్లపల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

- ప్రసన్న గిరిపై కొలువుదీరిన దాసాంజనేయ స్వామి దేవాలయంలో సిందూర పూజ, తమలపాకులతో అర్చనలు నిర్వహించారు.
- అక్కిరెడ్డిపాలెంలో పర్వతాంజనేయ స్వామి ఆలయంలో, తుంగ్లాంలోని ఆలయంలో అంజనీసుతునికి విశేష పూజలు చేశారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో ..

పెదగంట్యాడ: పెదగంట్యాడ అరుణ థియేటర్ పక్కన గల అభయాంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతులు స్వామిని దర్శించుకుని,అన్న సమారాధనను ప్రారంభించారు.

- బీసీ రోడ్డులోని భక్తాంజనేయ స్వామి వారి దేవాలయంలో అర్చకుడు సీతాపతి శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, పంచామృతాభిషేకాలు, సిందూర సహిత నాగవల్లీ దళార్చన నిర్వహించారు.
- దయాల్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో కొలువుదీరిన ఆంజనేయస్వామికి 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పూజలు చేశారు.
- నడుపూరులోని అభయ ఆంజనేయస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నరసింగరావు తదితరులు దర్శించుకున్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో..

ఉక్కునగరం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఉక్కు స్టేడియం ఎదురుగా ఉన్న హనుమాన్ ఆలయంలో శనివారం ఉదయం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు భజనలు చేశారు. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు.

సత్యసాయి సేవా కేంద్రంలో ....

సెక్టార్-2లోని సత్యసాయి సేవా కేంద్రంలో ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు, మహిళలు 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. వేకువజామున నగర సంకీర్తన నిర్వహించారు. స్వామికి వడమాల సమర్పించారు. అంతకు ముందు ఆధ్యాత్మిక గురువు జయ కామేశ్వరి పాల్గొని పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక భజనలు చేశారు. సమితి కన్వీనర్ జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో...

ఉక్కునగరం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. చిన్మయ మిషన్ ఆచార్య రఘువీరానంద ఆధ్వర్యంలో 1008 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. కార్యక్రమంలో భక్తులు, చిన్మయ మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

అగనంపూడి: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని 87వ వార్డు కణితి కాళింగవీధి గాంధీ బొమ్మ కూడలిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. సీతారామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు పూజలు చేశారు. కార్యక్రమంలో బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, శంకరరావు, దుగ్గపు దానప్పలు తదితరులు పాల్గొన్నారు.

- అగనంపూడిలోని ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో నిర్వాసిత కాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి



ఉక్కు సత్యసాయి సేవా కేంద్రంలో హనుమంతునికి పూజలు చేస్తున్న భక్తులు



కణితి అభయాంజనేయస్వామి ఆలయంలో..



పెదగంట్యాడ అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న తిప్పల రమణారెడ్డి

మధ్యాహ్నం లారీ ఓనర్ మామిడి పరమటయ్య దంపతుల ఆర్థిక సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు.

రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్‌కు సన్మానం

పెదగంట్యాడ: ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా సమాజంలో గుర్తింపు లభిస్తే, అటువంటి వ్యక్తుల జీవితం సార్థకమైనట్లేనని పోస్టల్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ సూపరింటెండెంట్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని బాలచెరువు బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన కె.కళావతికి పెదగంట్యాడ పోస్టల్ సిబ్బంది ఆధ్వర్యంలో వికాస్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళావతి దంపతులను సత్కరించారు. పెదగంట్యాడ పోస్ట్‌మాస్టర్ జి.సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ పోస్టుమాస్టర్లు పి.రామారావు, ఎస్.సత్యారావు, ఆర్.అప్పారావు, సమ్మిడి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్ట్‌మాస్టర్ కళావతి దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న సత్యనారాయణ